క్లుప్తంగా

అకడమిక్ స్టాఫ్ కాలేజీలో 'స్వచ్ఛ భారత్'



భవనంపై శుభ్రం చేస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలోని యూజీసీ అకడమిక్ స్టాఫ్ కాలేజీ(ఎంఎంటీటీసీ) పరిసరాల్లో సోమవారం సంస్థ ఉద్యోగులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కొంత కాలంగా ఇక్కడ పేరుకుపోయిన చెత్తను తీసి శుభ్రం చేశారు. గతంలో కురిసిన వర్షాలకు తుమ్మ చెట్టు విరిగి రేకుల షెడ్డుపై పడింది. దీన్ని తాళ్లతో కట్టి బయటకు తీశారు. కాలేజీ ఆవరణలో పచ్చదనాన్ని మరింత పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని ఉద్యోగులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటరావు, సీతారామ్, ప్రసాద్, లక్ష్మణ్, మోహన్ పాల్గొన్నారు.

శీతాకాలంలో ఆరోగ్యంపై అప్రమత్తం

ఆరిలోవ: శీతాకాలంలో ఆరోగ్య పరిరక్షణకు మరిన్ని జాగ్రత్తలు అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. హెల్త్ సిటీ కేర్ ఆస్పత్రి ఫిజీషియన్ అండ్ డయాబెటోలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ శ్రీనివాసన్ సోమవారం ఆరోగ్య సూచనలు చేశారు. శీతాకాలంలో ఒళ్లు నొప్పులు రాకుండా శరీరానికి వెచ్చదనం కలిగించాలన్నారు. ఎంత చలి ఉన్నప్పటికీ శరీరానికి వ్యాయామం, యోగా తప్పనిసరిని సూచించారు. చలికి కాళ్లు, చేతులు నొప్పులు రావడం, కాలి వేళ్లు వంకర్లు పోవడం జరగడం సహజమన్నారు. అలాంటప్పుడు కొంతసేపు నడిచి వ్యాయామం చేయాలని సూచించారు. మధుమేహం ఉన్నవారు శరీరం వెచ్చదనం కోసం వ్యాయామం అత్యవసరమన్నారు. చలికాలంలో రక్తం చిక్కబడి ప్రసరణ మందగించడం వల్ల ఎక్కువగా జలుబు చేసి తల బరువెక్కడం, జ్వరానికి గురికావడం జరుగుతాయని తెలిపారు. చింతపండు తదితర పుల్లని పదార్థాలు ఎక్కువగా తినకుండా జాగ్రత్త పడాలన్నారు.

ఏయూ నెట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ విజయమోహన్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ పురుషుల నెట్‌బాల్ జట్టు ఎంపిక సోమవారం జరిగింది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ అభినందించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ సురేశ్ జ్ఞానవిహార్‌లో జనవరి 3 నుంచి 5 వరకు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్‌బాల్ పురుషుల విభాగంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా.గోపికృష్ణ, ఏయూ వ్యాయామ విద్యా విభాగం గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ దిలీప్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రబ్బర్ స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



విశాలాక్షినగర్ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేస్తున్న స్పీడ్ బ్రేకర్లు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ పోలీసులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ మీదుగా జోడుగుళ్లపాలెం బీచ్ రోడ్డు వరకు మెయిన్ రోడ్డు, పర్యాటక ప్రాంతం కైలాసగిరికి వెళ్లే రహదారి కావడంతో ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది. ప్రమాదాల నియంత్రణలో భాగంగా సోమవారం ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ పర్యవేక్షణలో హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ వరకు పలు చోట్ల ప్లాస్టిక్ స్పీడ్ బ్రేకర్లు అమర్చారు. అవి రాత్రిళ్లు సైతం వాహన చోదకులకు స్పష్టంగా కనిపించేలా వాటిపై రేడియం రంగులు వేశారు.

యోగా భాగ్యం



ఏయూ స్కూల్‌లో యోగాసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

- ఏయూ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో యోగా బోధన
- నిత్యం సాధన చేస్తున్న విద్యార్థులు
- ఆరోగ్యం, ఏకాగ్రత, క్రమశిక్షణకు దోహదం
- సత్ఫలితాలు ఇస్తున్న శిక్షణ



అష్టవక్రాసనం



విద్యార్థులతో యోగా సాధన చేయిస్తున్న యోగా గురువు మల్లిక్

ఏయూక్యాంపస్: యోగా విద్య భారతీయుల విలువైన సంపద. దీనిని నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు అందిపుచ్చుకుంటున్నారు. మానవ శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా సాధన ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. దీనిని ప్రతీ వ్యక్తి సాధన చేయడం, నిత్య జీవితంలో భాగం చేసుకోవడం జరుగుతోంది. ముఖ్యంగా విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, వ్యక్తిగత వృద్ధి, ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతో దోహదపడుతుంది.

విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ

ఆంధ్రా యూనివర్సిటీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో యోగాను ఒక సబ్జెక్టుగా బోధిస్తున్నారు. ప్రతి రోజు విద్యార్థులకు యోగాలో వివిధ రకాల ఆసనాలు, మెలకువలు నేర్పుతున్నారు. పాఠశాలలో దీని కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశ మందిరంలో నిత్యం విద్యార్థులు సాధన చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 3 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు యోగా సాధనలో శిక్షణ ఇస్తున్నారు. యోగాలో పీజీ పూర్తి చేసిన మల్లిక్‌ను యోగా గురువుగా నియమించారు. దాదాపు 8 ఏళ్లుగా ఇక్కడ యోగాలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సైతం పాల్గొని తమ ప్రతిభతో అనేక పతకాలు గెలుచుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఆచార్య బి.ప్రసాదరావు ప్రత్యేకంగా విద్యార్థులకు యోగా శిక్షణలో తర్ఫీదు ఇవ్వాలని, దీనిని పరిచయం చేశారు. విద్యార్థులు దీని ప్రాముఖ్యతను, తమకు జరుగుతున్న మేలును గుర్తించి ఎంతో ఇష్టంగా నిత్యం యోగా సాధన చేస్తున్నారు.



శలభాసనం

నిత్యం గంట సాధన

ప్రత్యేక సమావేశ మందిరంలో నిత్యం ఉదయం వేళలో ఒక గంట పాటు విద్యార్థులు యోగా సాధన చేస్తున్నారు. అనంతరం మరింత తర్ఫీదు అవసరమైన వారికి, పోటీలకు వెళ్లే ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు యోగా ఆసనాల్లో ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. వీరికి అత్యంత క్లిష్టమైన ఆసనాలు, క్రియల్లో శిక్షణ అందిస్తున్నారు. ఇక్కడ నేర్చుకున్న ఆసనాలను విద్యార్థులు ఉదయం వేళల్లో ఇంటి వద్ద కూడా సాధన చేస్తున్నారు. పాఠశాలలో సూర్య నమస్కారాలు, జీర్ణ వ్యవస్థకు, ఏకాగ్రతను పెంచే, వెన్ను-నాడీ వ్యవస్థలను చైతన్యవంతంగా చేసే ఆసనాలను నిత్యం సాధన చేయిస్తున్నారు. జాను శీర్షాసనం, పశ్చిమోత్తాసనం, వక్రాసనం, అర్ధ మత్స్యాసనం, గోముఖాసనం, వ్యాఘ్రాసనం, త్రికోణాసనం, వీరభద్రాసనం, పూర్వోత్తాసనం, శశంకాసనం వంటివి ఇక్కడ విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. ప్రశాంత చిత్తం, మెదడు చురుగ్గా పనిచేయడం, చేసే పనిలో ఆసక్తి పెరగడానికి దోహదపడే ప్రాణాయామం చేయిస్తున్నారు.



సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



యోగా ధ్యానంలో విద్యార్థినులు

విద్యార్థులందరూ ఎంతో ఇష్టంగా.. ఉత్సాహంగా యోగాసనాలు నేర్చుకుంటున్నారు.

క్రమశిక్షణ అలవాటైంది



యోగా సాధన చేయడం వల్ల నిత్య జీవితంలో క్రమశిక్షణ అలవాటైంది. పాఠశాలలో మా ప్రవర్తనలో ఎంతో మార్పు వచ్చింది. చదువుపై గతంలో కంటే ఇప్పుడు ఆసక్తి, ఇష్టం పెరిగాయి. మెరుగైన ప్రతిభను చూపుతున్నాము. చెడు ఆలోచనలు దూరమవుతూ, ప్రశాంతత అలవాటు చేసుకున్నాం - వి.దాక్షాయణి, కె.గాయత్రి

ఆలోచనా శక్తి పెరిగింది



మొదట యోగాసనాలు మేము చేయగలమా అనే సందేహం ఉండేది. మెల్లగా సాధన చేస్తుంటే ఎంతో క్లిష్టమైన ఆసనాలు కూడా సునాయాసంగా చేయడం అలవాటైంది. యోగా చేస్తున్న విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరుగుతోంది. ప్రశాంతతతోపాటు త్వరగా పాఠ్యాంశాలు అవగాహన అవుతున్నాయి. - బి.అనూరాధ, పి.లాస్య

చదువుపై ఆసక్తి



యోగా క్లాస్‌కు రాక ముందు మేము బాగా అల్లరి చేసేవాళ్లం. నెమ్మదిగా మాలో అల్లరి తగ్గింది. విద్యపై ఆసక్తి, ఇష్టం బాగా పెరిగాయి. యోగా రోజు సాధన చేయడం వల్ల విద్యపై ఆసక్తి పెరిగి మంచి మార్కులు సాధిస్తున్నాం. యోగాసనాలు చేయడానికి అనుకూలంగా మమల్ని మేము మలుచుకున్నాం. - కె.సందీప్, వై.సతీష్

ఒత్తిడి నుంచి ఉపశమనం



మాపై నిత్యం తరగతి గదిలో ఎంతో ఒత్తిడి ఉంటుంది. వాటి నుంచి ఉపశమనం పొందడానికి యోగా మంచి సాధనగా నిలుస్తోంది. ప్రతి విద్యార్థిని దృష్టిలో ఉంచుకుని యోగాలో శిక్షణ ఇస్తున్నారు. క్రియలు చేయడం, అత్యంత క్లిష్టమైన ఆసనాలను సైతం మాతో వేయించడం జరుగుతోంది. - కె.సోను, జి.మనోజ్

డ్వాక్రా మేళా సక్సెస్



సందర్శకులతో కిటకిటలాడుతున్న డ్వాక్రా మేళా ప్రాంగణం

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ, మెప్మా ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో నిర్వహించిన డ్వాక్రా ఉత్పత్తుల మేళా సోమవారంతో ముగిసింది. తొలుత ఈ నెల 29నే మేళా ముగియాల్సి ఉండగా.. నగరవాసుల నుంచి విశేష స్పందన నేపథ్యంలో 30వ తేదీ వరకు కొనసాగించారు. చివరి రోజు కూడా నగర ప్రజలు పెద్ద ఎత్తున మేళాను సందర్శించి కొనుగోలు చేశారు. సోమవారం సాయంత్రం దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా మేళాను సందర్శించారు. మహిళా సంఘాల అభివృద్ధికి ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు అవసరమన్నారు. ఐదు రోజులుగా రూ.70 లక్షలకు పైగా వ్యాపార లావాదేవీలు జరిగినట్లు వెల్లడించిన జీవీఎంసీ అధికారులు చివరి రోజు కూడా పెద్ద ఎత్తున విక్రయాలు జరిగాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేళా ద్వారా ఉచితంగా స్టాళ్లు కేటాయించడంతో మంచి లాభాలు వచ్చినట్లు వ్యాపారులు పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌జీల ఆర్థిక భరోసాకి మేళా బాటలు వేసిందన్నారు. చివరి రోజు నిర్వహించిన కూచిపూడి, భరతనాట్యం వంటి సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యూసీడీ పీడీ సత్యవేణి, పీవో రమణమ్మ, సీవో పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వింటర్ చెస్ శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్ కేశవానంద

విశాఖ స్పోర్ట్స్: వింటర్ చెస్ క్యాంప్ పేరిట నగరంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన చెస్ శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. 6 నుంచి 60 ఏళ్ల వరకు చెస్‌లో పలువురు మెళకువలు నేర్చుకున్నారు. చెస్ నైపుణ్య అవసరాలు, మిడిల్ గేమ్ వ్యూహాలు, ఎండ్ గేమ్ థియరీ, కాంబినేషన్స్, విజువలైజేషన్‌తో లోతైన విశ్లేషణలతో ఓపెనింగ్స్‌పై అవగాహన పెంచుకున్నారు. ఎసెంట్ జూనియర్ కళాశాలలో ఈనెల 26వ తేదీ ప్రారంభమైన శిబిరం ఆదివారం రాత్రి పదిగంటల వరకు సాగింది. అంతర్జాతీయ స్థాయి అనుభవం కలిగిన ఫిడే ట్రైనర్ కేశవానంద 50 గంటల పాటు శిక్షణ నిచ్చారు. కామన్వెల్త్ -12 కాంస్య పతక విజేత అఖిల ప్రసాద్, 2100 ఫిడే రేటేడ్ ఆటగాడు రవి కృష్ణ, ఫిడే రేటేడ్ విజేత రుద్విక్ శిబిరంలో పాల్గొని మరిన్ని మెళకువలు నేర్చుకున్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు డాక్టర్లు పట్నాయక్, సిద్ధార్థలు సత్కరించారు.

మానవత్వం చాటుకున్న హెడ్ కానిస్టేబుల్



వృద్ధురాలిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జయరాం

టీచ్‌రోడ్డు: అస్వస్థతకు గురైన ఓ వృద్ధురాలిని తన సొంత వాహనంపై తీసుకెళ్లి మానవత్వం చాటుకున్నారు మూడో పట్టణ హెడ్ కానిస్టేబుల్. వివరాల్లోకి వెళ్తే.. పొరుగింటి వారితో గొడవ కారణంగా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న వృద్ధురాలు ఒక్కసారిగా అక్కడ తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో పోలీసులు అంబులెన్స్‌కు సమాచారం అందజేశారు. అంబులెన్స్ వచ్చే సరికి ఆలస్యం కావడంతో స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ చెల్లూరి జయరాం మానవత్వంతో తన సొంత వాహనంపై వృద్ధురాలిని అంబులెన్స్‌కు ఎదురుగా తీసుకుని వెళ్లారు. మార్గం మధ్యలో అంబులెన్స్‌లోకి వృద్ధురాలిని ఎక్కించి ఆస్పత్రికి తరలించారు. వృద్ధురాలి ప్రాణాలు కాపాడినందుకు ఆమె కుమారుడు నగర పోలీస్ కమిషనర్‌కు పంపిన మెయిల్ ద్వారా హెడ్ కానిస్టేబుల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ శంఖబ్రత బాగ్చి హెడ్ కానిస్టేబుల్ జయరాంను అభినందించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



తోటగరువు హైస్కూల్‌లో సైన్స్, గణితం ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం పాఠశాల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. 8, 9, 10 తరగతుల విద్యార్థులు సైన్స్, గణితం ప్రాజెక్టులు తయారు చేశారు. వ్యక్తిగత, బృందం వారీగా వాటిని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వీటితోపాటు ఉపాధ్యాయ సిబ్బంది కేటగిరీలో కూడా ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేయనున్నారు. ఉత్తమ ప్రాజెక్టులను ఈ నెల 31న శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో జరగనున్న మండల స్థాయిలో ప్రదర్శించనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

విద్యార్థుల సృజనాత్మకతకు నిదర్శనం

టీచ్‌రోడ్డు: స్కూల్ లెవెల్ సైన్స్ ఫెయిర్‌లో భాగంగా సోమవారం చిన్నవాల్తేరు కేడీపీఎం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. వృథా నీటి వినియోగం, లావా ల్యాంప్, హైడ్రో ఎలక్ట్రిసిటీ, మేగ్నిటిక్ బాంబ్ బ్లాస్ట్ వంటి ప్రాజెక్టులు విద్యార్థుల్లోని సృజనాత్మకతకు నిదర్శనంగా నిలిచాయి. ఈ ఫెయిర్‌ను ప్రారంభించిన స్కూల్ హెచ్‌ఎం ఎస్.సుమత విద్యార్థుల ప్రతిభను అభినందించారు. మంగళవారం జరగనున్న మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఈ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.



వృథా నీటి వినియోగం ప్రాజెక్ట్‌ను ప్రదర్శిస్తున్న కేడీపీఎం హైస్కూల్ విద్యార్థినులు



కేడీపీఎం హైస్కూల్‌లో హైడ్రో ఎలక్ట్రిసిటీ ప్రాజెక్ట్ ప్రదర్శన


విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాల పాత్ర కీలకం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖ విద్య: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాల పాత్ర ఎంతో కీలకమైనదని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 క్యాలెండర్, డైరీను సోమవారం ఆవిష్కరించారు. విద్యా సంబంధిత సమాచారంతో పొందుపరిచిన క్యాలెండర్, డైరీ ఉపాధ్యాయులకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేద్కర్, గౌరవ అధ్యక్షుడు అనకాపల్లి పైడిరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి. అప్పారావు, జిల్లా సహాధ్యక్షులు రొంగలి ఉమాదేవి, కోశాధికారి రాంబాబు, జిల్లా కార్యదర్శులు చుక్కసత్యం, రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఐహెచ్‌ఆర్సీ స్టేట్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా పైడిరాజు



టీచ్‌రోడ్డు: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా మాదాబత్తుల పైడిరాజు నియమితుడయ్యారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన కౌన్సిల్ కార్యవర్గ సమావేశంలో ఐహెచ్‌ఆర్సీ ఏపీ స్టేట్ బోర్డ్ అధ్యక్షుడు ఉమ్మిడి సునీల్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. గతంలో పైడిరాజు ఐహెచ్‌ఆర్సీ ఉత్తరాంధ్ర రీజియన్ బోర్డ్ పబ్లిక్ విభాగానికి ప్రధాని కార్యదర్శిగా పనిచేశారు. ఆయన సమర్థవంతమైన పనితీరుకు గానూ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్టు సునీల్ తెలిపారు. ఐహెచ్‌ఆర్సీ ఏపీ స్టేట్ బోర్డ్ ఉపాధ్యక్షుడు కె.శివ వరుణ్, కార్యవర్గ సభ్యులు పి.లిఖిత, పి.చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలు లేకుండా చూడాలి

మహారాణిపేట: జిల్లాలో మాతా, శిశు మరణాలు లేకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం మాతృ, శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. చంద్రానగర్, బాలాజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రెండు మాతృ మరణాలు, పెదగంట్యాడ, కొంత్యాం, రేవిడి ఆరోగ్య కేంద్రాల్లో మూడు శిశు మరణాలు సంభవించాయన్నారు. భవిష్యత్తులో ఎటువంటి మాతా, శిశు మరణాలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు ఉషాప్రసాద్, గిరిధర్, షర్మిలాకుమారి, శ్రావణ్, 108 డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఐ.మనోరమ పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో ఏయూ విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న ఏయూ విద్యార్థి

విశాఖ విద్య: దక్షిణ భారత యువజనోత్సవాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ నెల 26 నుంచి 30 వరకు చెన్నై ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వేదికగా జరిగిన యువజనోత్సవాల్లో పాల్గొన్న వర్సిటీ విద్యార్థులు వివిధ విభాగాల్లో బహుమతులు సాధించారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత సాధించారు. ఏయూ నుంచి 25 మంది విద్యార్థులు 16 విభాగాల పోటీల్లో పాల్గొని పది బహుమతులను గెలుచుకున్నారు. రంగోలిలో జి.దీక్షిత మొదటి స్థానం, క్లే మోడలింగ్‌లో డి.గోపి మూడో స్థానం, కార్టూనింగ్‌లో షేక్ రఫీ 4వ స్థానం, స్పాట్ పెయింటింగ్‌లో పి.గిరిప్రసాద్ ఐదో స్థానం, పోస్టర్ మేకింగ్‌లో జి.రేణుక ఐదో స్థానం, ఇన్‌స్టాలేషన్‌లో ఎ.హేమలత, కె.రేణుక, ఎల్.అశోక్, ఎం.శ్రీను ఐదో స్థానం, మెహందీలో బి.లీలావతి 5వ స్థానం సాధించారు. జాతీయ స్థాయిలో జరిగే యువజనోత్సవాలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం ఏయూ అధికారులు అభినందించారు.

ఫిబ్రవరిలో గోవుల పాల పోటీలు



మాట్లాడుతున్న డాక్టర్ సింహాచలం

ఆరిలోవ: ఉత్తర కోస్తా జిల్లాల్లో గోవుల పాల పోటీలను ఫిబ్రవరిలో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ స్మైల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ యండ సింహాచలం తెలిపారు. పాత డెయిరీ ఫారం వద్ద స్టేట్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైవ్‌స్టాక్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ (స్మైల్) అదనపు సంచాలక కార్యాలయంలో పశు సంవర్ధక శాఖ అధికారులు, బీఎంసీ సభ్యులతో కలిసి ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు.పాడి రైతులకు పాల పోటీల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ ఉత్తర కోస్తా జిల్లా పాడి రైతుల ప్రయోజనం కోసం బోవరీ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ (బీఎంసీ) ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో విజయనగరం జిల్లాలో పాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో బీఎంసీ సభ్యులు, పశు వైద్యాధికారులు, పాడి రైతులు అధిక సంఖ్యలో పాల్గొనేటట్లు సన్నాహాలు చేస్తున్నామన్నారు. పాడి రైతులకు పాల ఉత్పత్తిపై ఆసక్తి కనబరచడానికి, పాల ఉత్పత్తి దిగుబడి పెంచడానికి ఈ పోటీలు ఉపయోగపడతాయని భావిస్తున్నామన్నారు. దేశవాలీ పాడి పశు జాతులైన సాహివాల్, గిర్, ఒంగోలు, ముర్రా జాతులు, సంకర జాతికి చెందిన హెచ్‌ఎఫ్, జెర్సీ ఆవులను తీసుకువచ్చే రైతులను ఈ పోటీలకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎంసీ ప్రతినిధులు సీహెచ్ నర్సింహరావు, కె.వైకుంఠరావు, కేవీఎస్ఎన్ రాజు, జి.వేణుగోపాల్, పశు వైద్యాధికారులు డాక్టర్ ఆర్.కృష్ణ, డాక్టర్ ఎల్.విష్ణు, డాక్టర్ జి.వి రాజశేఖర్, డాక్టర్ ఎం.చంద్రశేఖర్, డాక్టర్ బి.ప్రసాదరావు, డాక్టర్ ఎస్.కరుణాకరరావు, డాక్టర్ ఎ.రామచంద్రరావు, డాక్టర్ ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

అల.. సాగరతీరంలో... సర్ఫింగ్



ఏయూక్యాంపస్: నీలి నీలి ఆకాశం... కనుచూపు మేరలో నీల వర్ణంతో మైమరపించే సాగరం. ఈ రెండూ కలిసి పోయాయా అన్నంతగా మన కన్నులను మైమరపించే సుందర దృశ్యం. పెదజాలరిపేట వద్ద ఈ దృశ్యం 'సాక్షి' కంటపడింది. అక్కడే ఉన్న కొంతమంది మత్స్యకార చిన్నారులు కెరటాలపై సర్ఫింగ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. వీరు చేపపిల్లలను తలపించేలా సముద్ర కెరటాలతో పోటీ పడుతూ.. నీటిపై తేలుతూ సర్ఫింగ్ చేస్తూ సందడి చేశారు. వీరికి సరైన శిక్షణ అందిస్తే ఈ క్రీడలో రాణించే అవకాశాలు ఉంటాయి. సహజ సిద్ధంగా వీరికి అలవడిన లక్షణాలను కొంత సానబెడితే మంచి క్రీడాకారులుగా వీరు మారుతారు. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పేరెంట్స్ అసోసియేషన్ సదస్సుకు ఆహ్వానం

మద్దిలపాలెం: ఆలిండియా పేరెంట్స్ అసోసియేషన్ మూడో జాతీయ సదస్సు-2025కు నగరానికి చెందిన నరవ ప్రకాశరావు ఆహ్వానం అందింది. దీనికి సంబంధించిన వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. జనవరి 4, 5 తేదీల్లో ఒడిశా రాష్ట్రం పూరిలోని ఇసూపంతు ఆశ్రమ ప్రాంగణంలో జాతీయ సదస్సు జరగనుందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. సదస్సులో ప్రధానంగా జాతీయ విద్యా విధానం, విద్యను ప్రైవేటీకరణ చేయడం, విద్యా రుసుం పెంపుదల, విద్యా బోధన మాధ్యమం తదితర అంశాల గురించి చర్చించనున్నారన్నారు. ఈ సదస్సుకు గౌరవ సలహాదారుగా తాను వ్యవహరించనున్నట్లు ప్రకాశరావు తెలిపారు.